**International Journal of Academic Research** P-ISSN: 2348-7666: Impact Factor: 6.023
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]
Homepage: https://www.ijar.org.in/
Volume-12, Issue-2, April-June-2025

**Research Article**

# జాషువా 'గబ్బిలం' కావ్యం- దళిత రాజ్యాధికారం

**బంటు ప్రసాదరావు**
ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వీరఘట్టం, పార్వతీపురం మన్యం జిల్లా

**వ్యాస సంగ్రహం:**

తెలుగు సాహిత్యంలో ఉద్యమ సాహిత్యానికి చాలా ప్రధాన్యత ఉంది. అందునా దళిత సాహిత్యానికి ఒక ప్రాధాన్యత కలదు. దళిత సాహిత్య ఉద్యమం తలెత్తిన తరవాత దళిత సమస్యల చిత్రణ స్పష్టతను ప్రఖ్యాతను ఏర్పరచుకొంది.దళిత ప్రస్తావనకు ఒక దిశా నిర్దేశం జరిగింది. లక్ష్య స్పుటత ఏర్పడింది.కాని తత్ పూర్వం కూడా దళిత ప్రస్థావన ఉంది. దళితుడుగా, అంటరాని వాడిగా, చండాలుడిగా వివిధ రూపాల చిత్రణ ప్రాచీనంలో ఉంది. అయితే అంతకు మించి ఆధునిక సాహిత్యంలో కోకొల్లలు. స్వాతంత్రోద్యమ కాలంలో దళితుల సమస్యల పట్ల రచనలు చేసిన సాహితీవేత్తలెందరో ఉన్నారు. జాషువా 'గబ్బిలం' కల్పించిన ప్రకంపనలు సాహిత్య చరిత్ర ఎరిగినదే. గొట్టుముక్కల మంగాయమ్మ, బోయి భీమన్న, మోదుకూరి జాన్సన్ వంటివారు సాహిత్యాన్ని సృజించారు అయితే ఇదే కాలంలో దళిత సాహిత్య తత్త్వ గుణాన్ని ఇవ్వలేక పోయాయి. దళితుడు రాస్తే అవి మరోలా ఉండేవి. కనుకనే దళిత సాహిత్యం దళిత దృష్టి కోణాన్ని ఆవిష్కరించేదిగా, దళిత జీవన ప్రతిబింబంగా, దళితాత్మ బోధకంగా ఉండాలని భావించడం జరిగింది. ఈ కోణంలో పరిశీలించినపుడు 'గబ్బిలం' కావ్యంలో దళితుల ఆవేదనే కాకుండా, వారికి రాజ్యాధికారం అత్యంత ఆవశ్యకం అనే పరోక్ష ఆలోచన కూడా ద్యోతకమవుతుంది. అసలు జాషువా ఆశించిన దళిత రాజ్యాధికారం ఈ కావ్యలో ఎలా ప్రతిబింబించిందో పరిశీలించడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశం.

**కీలక పదాలు:**

గబ్బిలం, రాజ్యాధికారం, అస్పృశ్యులు, దళిత జనోద్ధరణ, అంటరానితనం, కాట్రేడు, అరుంధతీ సుతుడు, ప్రజాస్వామ్యం మొదలైనవి.

**కవి పరిచయం:**

గుర్రం జాషువా సెప్టెంబర్ 28, 1895లో గుంటూరు జిల్లా వినుకొండలో వీరయ్య, లింగమాంబ దంపతులకు జన్మించారు. తెలుగు సాహిత్యంలో "నవయుగ కవిచక్రవర్తి" మరియు "విశ్వకవి" గా ప్రసిద్ధి చెందిన గొప్ప అభ్యుదయ కవి. కుల వివక్ష, అంటరానితనం, పేదరికం వంటి సామాజిక రుగ్మతలపై తన కలాన్ని ఆయుధంగా మలుచుకొని, అణగారిన

వర్గాల కోసం గళమెత్తిన మహాకవి. చిన్నతనంలో కుల వివక్ష వల్ల అనేక అవమానాలు ఎదుర్కొన్నారు. అయితే వాటిని అధిగమించి, కవిత్వమే తన జీవితంగా మలచుకున్నారు.భారత ప్రభుత్వం నుండి 'పద్మభూషణ' పురస్కారంతో పాటు, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి 'కళాప్రపూర్ణ' వంటి గౌరవాలు పొందారు.

ఆధునిక సమాజాన్ని పరిశీలిస్తే దళితులంటే అస్పృశ్య జాడ్యానికి బలవుతున్న వారేనన్నది స్పష్టం. దీనికి సమాంతరంగా సాహిత్యంలో కొంత బిసి వాదం అక్కడక్కడ కనిపిస్తుంది. దళితుడే సాహిత్యం సృజించినపుడు, ఆదళిత స్వరం నిఖార్సయిన వాస్తవాన్ని సమాచారాన్ని అందిస్తుంది. ఈ విధమైన విధానాన్ని అక్షరాలా అనుభవించి దళితుల అభ్యున్నతికి కట్టుబడింది 'గుర్రం జాసువా'. పందొమ్మిదవ శతాబ్ది చివరి దశాబ్దిలో పుట్టి ఇరవయ్యవ శతాబ్ది పూర్వార్ధంలో జీవించి పీడిత ప్రజలకోసం తన రచనలను అంకితం చేసిన ప్రజాకవి గుర్రం జాషువా. అంటరాని కులంలో పుట్టి, కుల పీడనను అనుభవించి సామాజిక రుగ్మతలపై కలం ఝుళిపించిన ప్రగతిశీల కవి జాషువా. బాధలనుండి, కష్టాలనుండి, వేదననుండి గొప్ప కవిత్వం వస్తుందనడానికి జాషువా గబ్బిలమే చక్కని ఉదాహరణ. గబ్బిలం కావ్యం గురించి:

మహాకవి గుర్రం జాషువా రచించిన 'గబ్బిలం' ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక అజరామరమైన, విప్లవాత్మకమైన ఖండకావ్యం అని చెప్పొచ్చు. కుల వివక్ష, అంటరానితనం, దళితుల ఆవేదనను అద్భుతమైన పద్య రూపంలో సమాజం ముందుంచిన గొప్ప కావ్యం ఇది. సంస్కృతంలో కాళిదాసు రచించిన మేఘదూతంలో 'మేఘాన్ని' దూతగా పంపితే, జాషువా సమాజంలో అందరూ అశుభంగా, అసహ్యంగా భావించే 'గబ్బిలాన్ని' దూతగా ఎంచుకున్నారు. దళితులకు దేవాలయ ప్రవేశం లేని ఆ కాలంలో, గుడిలో నివసించే గబ్బిలం ద్వారా తన గోడును కాశీ విశ్వనాథునికి చెప్పుకునేలా అద్భుతమైన కథావస్తువును సృష్టించారు. అంటరానితనం వల్ల ఒక దళితుడు పడుతున్న ఆకలి బాధలు, కన్నీరు, దయనీయమైన జీవితాన్ని కన్నీటి పద్యాలుగా మలిచారు. కుల వ్యవస్థలోని అమానవీయతను, వర్గ అసమానతలను ప్రశ్నిస్తూ సమాజానికి కనువిప్పు కలిగించారు. ఛందస్సు, వ్యాకరణం వంటి సంప్రదాయ పద్య నిర్మాణాన్ని అనుసరిస్తూనే, వస్తువు, భావనలో అభ్యుదయవాదాన్ని, ఆధునికతను ప్రదర్శించారు. తెలుగు సాహిత్యంలో దళితుడిని ఒక నాయకుడిగా, ప్రధాన పాత్రధారిగా తీర్చిదిద్దిన తొలి కావ్యం ఇది. అందుకే జాషువాను తెలుగు దళిత సాహిత్య పితామహుడిగా పిలుస్తారు. ఈ కావ్యానికి ఉన్న అంతర్జాతీయ గుర్తింపును బట్టి దీని స్థాయిని అర్థం చేసుకోవచ్చు. ఆంగ్లంలోకి 'గబ్బిలం: ఏ దళిత్ ఎపిక' పేరుతో అనువాదమై, 2024లో ప్రతిష్టాత్మకమైన 'ఏ.కే. రామానుజన్ బుక్ ప్రైజ' ను కూడా గెలుచుకుంది. ఇంకా చెప్పాలంటే, వాల్మీకి శోకంలోని శ్లోకం ఉదయించినట్లు జాషువా పడ్డ కుల పీడనలోంచి, అవమానాలనుంచి గబ్బిలం కావ్యం పుట్టింది. దళిత సాహిత్యంలో దళితుల గురించి ఎన్ని రచనలు ఉన్నప్పటికీ గబ్బిలంలో ఉన్న దళిత వాస్తవిక జీవిత చిత్రణ,దళిత పక్షపాతం, దళిత సంవేదన మరేదళిత రచనలోనూ కనబడదు.

**గబ్బిలం -రాజ్యాధికారం:**

అస్పృస్యత, అంటరానితనం నిర్మూలన, దళిత జనోద్ధరణ కోసం ఎంతోమంది రచనలు చేశారు. అయితే అంబేద్కర్ మాత్రం తన రచనల్లో దళితులకు రాజ్యాధికారం కావాలనే నినాదం వినిపించాడు. ఇదే బాటని అవలంబించిన కవి గుర్రం జాషువా గబ్బిలం కావ్యంలో దళితుల రాజ్యాధికార ప్రస్తావన అడుగడునా ప్రస్తావింపజేశాడు. దళిత అభ్యున్నతికి అడ్డంకిగా ఉన్న మత మౌఢ్యాన్ని విడనాడాలన్నాడు. ఈ దేశంలో దళితుడు పడుతున్న బాధలను, అవమానాలను తనదేశంలోనే తాను పరాయివాడు అవుతున్న క్రమాన్ని ఓ దళిత పాత్ర ద్వారా గబ్బిలానికి విన్నవించాడు రచయిత. గబ్బిలంతో శివునికి విన్నవించే విన్నపాలలో దళిత రాజ్యాధికార ప్రస్తావన కూడా ఉంది.

దళిత రాజ్యాధికారం కావాలని కోరుకునే వాళ్ళు చాలామంది ఉన్నా, హిందూమత పరిధిలోబడి కోరుకున్నవాళ్లు ఉన్నారు. అలాగే పరిధిదాటిపోయినప్పుడే అది సాధ్యమవుతుందని కోరుకుంటున్నవారు ఉన్నారు. అయితే జాషువా పంథా వేరు. గబ్బిలం కావ్యంలో అతని దళిత దృక్పథమేంటో పూర్తిగా అర్థమౌతుంది. ఇలా రాజ్యాధికారాన్ని అందిపుచ్చుకోవాలంటే దృక్పథాలు మారాలంటారు. అందుకోసం పరితపించాలంటారు. అయితే ఈ వర్ణపిశాచం ఉన్నంత వరకూ ఇది సాధ్యమవుతుందా? అనే అనుమానం వ్యక్తం చేయడం గమనించదగ్గ విషయం.

భారత దేశంలో ఆకు, అలము, బండ, చెట్టు, పుట్ట అన్నీ దేవుళ్లే అయినా వర్ణపిశాచం ఎంతో ఘోరంగా, క్రూరంగా రాజ్యమేలుతుందో జాషువా ఈ పద్యం ద్వారా చెప్పాడు.

> "కనబడలేదు దైవతముగాని పదార్థము భారతంబునన్
> గనుపడలేదు వర్ణమున కన్న పిశాచము భారతంబునన్
> కనబడేదు సూత్కులముకన్న మహాకళ భారతంబునన్
> గనుపడలేదు పంచముని కన్నను నీచపు జంతువేదియున్ "

(గబ్బిలం,రెండవకూర్పు, పుట:41)

ఈ దేశంలో పంచమున్ని చేసినంత నీచంగా ఏ జంతువునూ చూడట్లేదని కవి ఆవేదన వ్యక్తం చేశాడు.

ఈ దేశంలో పని ఒకరిదయితే, కష్టం ఒకరిదయితే, ఫలితం వేరొకరిదిగా ఉండే వ్యవస్థను ప్రశ్నించాడు. పనిచేసేవారు కొందరయితే ఫలితం అనుభవించేవారు మరి కొందరుగా ఉన్న దుర్మార్గాన్ని ఖండిస్తున్నాడు.పరోక్షంగా ఎవరి శ్రమ ఫలితం వారికి దక్కాలని చెబుతున్నాడు. జాషువాపై మార్క్స్ ప్రభావం అంతగా లేకపోయిన సమానత్వాన్ని కోరుకున్నాడు.

> "క్రూరుల్ కుత్సితుస్మదీయులు హక్కుల్ దోచుకున్నారున
> న్నూరింబయటకు నెట్టినారిపుడు ....."

అని సమాజంపై నిప్పులు కక్కుతున్నాడని, అంతేకాకుండా దళితుల సమస్యల పరిష్కారానికి రాజ్యాధికారం కావాల్సిన అవసరమేంటో వాళ్ళ పేదరకాన్ని, దైన్యమైన బతుకులను గూర్చి చెబుతున్నాడు.

> "ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి

యినుపగజ్జెల తల్లి జీవనము సేయు" (గబ్బిలం, పుట:3)

-అని ఆవేదనను వ్యక్తంచేయడం గమనించవచ్చు. భగవంతునితోనూ నిర్లక్ష్యాన్ని సరిచేయబడ్డ పంచముడు ఎప్పుడు అభాగ్యుడే అని బాధపడటం చూడొచ్చు.

దళితులపై శ్రమజీవులపై దోపిడీ రాజ్యాధికారం సాగుతుందని, ఎన్నో అగచాట్లకు దళితులు గురౌతున్నారని, దోపిడీ పీడనలు ఎలా సాగుతున్నాయో, కర్మసిద్ధాంతం పేరు పెట్టి దళితుల భుక్తిని కూడా ఆదరించే స్వార్థంలోబరుస్తున్నాడని జాషువా కర్మసిద్ధాంతాన్ని ఖండించడం ఆలోచించాల్సిన విషయం.

జాషువా రాజ్యాధికారం గురించి చెబుతూ అది దళితులకు ఎంత అవసరమో కూడా వివరించడం ఆయన లోకజ్ఞానానికి ప్రతీకగా చెప్పొచ్చు. భారతీయుని పాదము కందకుండా అతని పాదాలకు రక్షలుగా చెప్పులు కుట్టి ఇస్తున్నాడు దళితుడు. అలాంటి పనితో జీవితం వెళ్ళదీస్తున్న పంచముడు ఏరోజు పనిని నిరాకరించలేదు. తన ధర్మాన్ని నెరవేరుస్తూనే ఉన్నాడు. అలాంటి దళితునికి భారత భూమి అప్పుపడ్డాదంటాడు జాషువా. అలాగే భారతీయులు దళితులకు రాజ్యాధికారం అప్పగించి దేశానికి చేసిన సేవలకు గాను పడ్డ బాకీని తీర్చుకోవాలని తన గంభీర్యతను చాటడం కూడా ఆలోచనకు గురిచేసే అంశం.

"వానిరెక్కల కష్టంబు లేనినాడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాడు చెమ్మటోడ్చి ప్రపంచమునకు
భోజనము పెట్టువానికి భుక్తి లేదు" (గబ్బిలం, పుట:2) అని పేర్కొన్నాడు.

దళితుడు రెక్కల కష్టం చేయకుంటే ప్రపంచానికి తిండిలేదని, అలాంటి దళితుడికి రాజ్యాధికారం అవసరమే కదా? ఎందుకు రానీయకుండా చేస్తున్నారని, వారి కష్టాన్ని వారికే ఇవ్వాలనే ప్రతిపాదన చేస్తూ పరోక్షంగా ప్రశ్నించడం చూడొచ్చు.

"ఏనాడు మాకావ్య సృష్టికర్తల జిహ్వ
విశ్వసత్యము నాలపింపగలదో
అట్టి శుభవేళకై కొంగుబట్టి నిలచి
నలిగి వాపోవుచున్నది నా మనస్సు...... "(గబ్బిలం, రెం.కూర్పు, పుట:23)

-అని అంటాడు జాషువా. ఇక్కడ గమనించాల్సింది సమానత్వ భావన. జాషువా పీడిత జాతుల సమానత్వం ఆశించారు. అదే విశ్వ సత్యం అని నమ్మారు. అది దళితుల రాజ్యాధికారంతోనే సంభవిస్తుందన్నది ఉద్బోధిస్తూ సత్యవాక్యాలు పలికారు.

స్వతంత్రంపై గాంధీపై అపారనమ్మకం జాషువాకుంది. అందుకనే స్వరాజ్యం వస్తే, ఆ స్వరాజ్య సౌధంలో దళిత జీవితానికి ప్రతీకయైన గబ్బిలం ప్రతిష్ఠిస్తానంటున్నాడు కవి.

"నీవు కావించిన రాయబారమునకు న్నిత్యాభిషేకంబుగ

నా కన్నీటిని కాన్కగా యొసగుచున్నానో ..... "(గబ్బిలం,రెం.కూర్పు, పుట:11)

- అంటూ తన కృతజ్ఞతా నివేదనను తెలియజేస్తాడు కవి.

అనాదిగా వేల సంవత్సరాలుగా ఊరికి, గుడికి దూరమైన మాల, మాదిగలకు స్వరాజ్య సాధంలో స్థానం దొరకడం అంటే సర్వం రాజ్యాధికారం సిద్ధించినట్లే అని కవి అభిప్రాయం తెలపడం గమనార్హం. అందుకే "నీ జాతికెంత వచ్చునో రాజత్వంబు నాకు రావచ్చుకదా, నా జాతియెత్తు కేతన రాజంబున నీదు మఌర్తి వ్రాయించుచెలీ" అని పేర్కొంటాడు జాషువా.

గబ్బిలం కావ్యం ద్వారా ప్రజాస్వామ్యయుత దళిత రాజ్యాధికారం గురించి జాషువా 20వ శతాబ్దంలో కలలు కంటే 21వ శతాబ్దంలో అది నిజం కాబోతుందని అర్థమవుతుంది.

"చిక్కిన కాసుచే దనివిజెందు నమాకుడెల్ల కష్టముతో

............. జన్మమెత్తి భరతోద్వరకుల గడగొట్టుబిడ్డడై"

-అంటూ అరుంధతీ సుతునకు రాజ్యాధికారం రావడం కన్న స్వతంత్రానికున్న గొప్ప ప్రజాస్వామిక ప్రయోజనమేంటి? కావున దళితులకు రాజ్యాధికారం అవసరం. వారి సమస్యల పరిష్కారానాకి ఇది తప్పని సరి అని గబ్బిలం కావ్వం ద్వారా గురం జ్రాషువా సందేశాన్ని అందించారు.

**ముగింపు:**

మహాకవి గుర్రం జాషువా రచించిన 'గబ్బిలం' కావ్యంలో ప్రత్యక్షంగా నేటి రాజకీయ పరిభాషలోని 'దళిత రాజ్యాధికారం' అనే పదం వాడకపోయినప్పటికీ, దళితుల సామాజిక, రాజకీయ సాధికారత మరియు హక్కుల సాధన గురించిన బలమైన పునాది, దార్శనికత ఈ కావ్యంలో స్పష్టంగా కనిపించింది. జాషువా తన కవిత్వం ద్వారా కేవలం దళితుల బాధలను మాత్రమే వివరించలేదు, సమాజంలో వారికి దక్కాల్సిన సమాన భాగస్వామ్యాన్ని, అధికారాన్ని కూడా ప్రశ్నించారు. దేశ సంపదను, ఆహారాన్ని సృష్టించేది దళితులేనని జాషువా గుర్తుచేశారు. "కంటి నీరు తుడిచి, కాట్రేడు (పాలకుడు) కిరీటమున నిలిపినాడు" అంటూ, రాజుల లేదా పాలకుల అధికారానికి దళితుల శ్రమే మూలమని చాటిచెప్పారు. సమాజానికి అన్నం పెట్టే కష్టజీవికి అధికారంలో, సామాజిక హోదాలో ఎందుకు వాటా లేదని ఆయన ప్రశ్నించడం ద్వారా దళిత రాజకీయ స్పృహకు బీజం వేశారు. అప్పటివరకు కేవలం అగ్రవర్ణాలకే పరిమితమైన సంస్కృత సమాస భూయిష్టమైన కావ్య శైలిని జాషువా స్వీకరించారు. తద్వారా మేధోపరమైన లేదా సాహిత్యపరమైన అధికారం కేవలం ఒక వర్గానికే సొంతం కాదని, దళితులు కూడా అందులో సమానులని నిరూపించారు. సమాజం అశుభంగా భావించే 'గబ్బిలాన్ని' తన దూతగా, ఒక అంటరానివాడిని కథానాయకుడిగా మార్చడం ద్వారా సాంస్కృతిక మరియు సామాజిక అధికార నిర్మాణాలను ఆయన తల్లకిందులు చేశారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా జరుగుతున్న స్వాతంత్ర్య

పోరాటాన్ని ప్రస్తావిస్తూనే, రాబోయే స్వతంత్ర భారతదేశంలో దళితులకు సమాన హక్కులు, రాజకీయ వాటా దక్కాలని ఆకాంక్షించారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చి, స్వయంపాలన (రాజ్యాధికారం) సిద్ధించినప్పుడు అందులో అణగారిన వర్గాలకు సమానమైన ప్రాతినిధ్యం లేకపోతే ఆ స్వాతంత్ర్యానికి అర్థం లేదనే హెచ్చరిక ఈ కావ్యంలో అంతర్లీనంగా ఉంటుంది. జాషువా 'గబ్బిలం' కావ్యం ద్వారా దళితులలో ఆత్మగౌరవాన్ని, సామాజిక చైతన్యాన్ని రగిల్చారు. ఈ ఆత్మగౌరవ చైతన్యమే తర్వాతి కాలంలో డా.బి.ఆర్.అంబేద్కర్ భావజాలంతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో బలమైన దళిత ఉద్యమాలకు మరియు రాజకీయ/రాజ్యాధికార పోరాటాలకు ప్రధాన ఊపిరిగా నిలిచింది అని చెప్పడంలో ఏవిధమైన సందేహం లేదు.

**ఆధార గ్రంథాలు :**


1.జంగయ్య, బోయి, విశ్వనరుడు గుఱ్ఱం జాషువా, ప్రగతి పబ్లిషింగ్ హౌస్, 1998

2.జాషువా, గుఱ్ఱం, గబ్బిలం, జానకీరామ్ ప్రెస్, తెనాలి, 1941

3.జాషువా, గుఱ్ఱం, గబ్బిలం(రెండవ కూర్పు), శ్రీ కొండపల్లి ముద్రశాల, రాజమండ్రి,1954.

4.తెలుగు అకాడమీ, గబ్బిలం జాషువా తాత్త్విక స్వప్నం, హైదరాబాద్


**Citation:** బంటు ప్రసాదరావు 2025. "జాషువా 'గబ్బిలం' కావ్యం- దళిత రాజ్యాధికారం". International Journal of Academic Research, 12(2): 127-132.
**Copyright:** ©2025 బంటు ప్రసాదరావు. This is an open-access article distributed under the terms of the Creative Commons Attribution License (https://creativecommons.org/licenses/by/4.0/), which permits unrestricted use, distribution, and reproduction in any medium, provided the original author and source are credited.